క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో పలు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ టి.కామేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లిషు, హిందీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హత కలిగిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను పూర్తి చేసి ఈ నెల 12, 13 తేదీల్లో తమ పాఠశాలలో అందజేయాలని తెలిపారు. ఇంగ్లిషులో టీజీటీ, పీజీటీ, ఫిజికల్ సైన్స్‌లో పీజీటీ, హిందీ బోధనకు టీజీటీ, పీజీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన



రోగులకు సూచనలిస్తున్న మాసిలామణి

వింజమూరు(ఉదయగిరి): ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాసిలామణి అన్నారు. వింజమూరులో శనివారం క్యాన్సర్, మెదడులో కణుతులు తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు రోజులో ఎక్కువ సేపు సెల్‌ఫోన్స్‌తో గడపడం ద్వారా వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. రోజుకు 18 గంటలకు పైగా కంప్యూటర్, సెల్ వినియోగం ఉన్న వారిలో మెదడులో కణుతులు ఏర్పడి క్యాన్సర్‌గా మారవచ్చన్నారు. ఈ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పలువురు రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

డ్రైనేజీ వ్యవస్థ లేక అవస్థలు



రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

సోమశిల: అనంతసాగరం మండలంలోని పలు పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో చిన్నపాటి వర్షం కురిసినా ఆ నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లు జలమయం అవుతున్నాయి. గ్రామాల్లోని పలు వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా అనంతసాగరం, దేవరాయపల్లి, వెంగంపల్లి, మంచాలపల్లి తదితర గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడంతో గ్రామస్తులు వీధుల్లో నడవలేని పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. పందుల సంచారం కూడా పెరిగిపోయిందని, దోమల బెడదతో అక్కడి ప్రజలు రోగాల బారి పడుతున్నామని తెలిపారు. పంచాయతీ అధికారులు, మండల అధికారులు స్పందించి పారిశుద్ధ్య వ్యవస్థ, డ్రైనేజీలు మెరుగుపరచాలని, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్తతో నిండిన మురుగు కాలువ

ఉత్తరం.. ఓ మధుర జ్ఞాపకం..!

- ఆధునికతతో కనుమరుగవుతున్న జాబులు
- లేఖలు రాసేవారు లేక తపాలా పెట్టెలు వెలవెల
- స్మార్ట్‌ఫోన్‌లతో అలనాటి వైభవం ఏమాయె..!



తపాలా కార్యాలయం



నాటి పోస్ట్ కార్డులు, ఉత్తరాలు



ఉత్తరాలు లేక వెలవెలబోతున్న తపాలా పెట్టె

సీతారామపురం: తోకలేని పిట్ట తొంభై ఆమడల దూరం పోయింది.. ఏంటది అని అడిగితే 'ఉత్తరం' అని తమాషాగా సమాధానం చెప్పే రోజులు పోయి.. లేఖలు రాసేవారే కరువైన రోజులు వచ్చాయి. గతంలో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సంభాషణలు జరిగేవి. యోగక్షేమాల నుంచి దసరా, సంక్రాంతి, దీపావళి పండగల సంగతులు, మంచిచెడులతోపాటు అన్ని సంఘటనలను లేఖల్లో నిక్షిప్తం చేసేవారు. తమకు వచ్చే లేఖలను ఆసక్తిగా చదువుకుని భద్రంగా దాచుకునేవారు. గుర్తుకువచ్చినప్పుడు వాటిని తీసి చదువుకొని తీపి జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు. సాంకేతిక విప్లవం జోరందుకున్న తరుణంలో నేటితరం ఉత్తరాలంటేనే తెలియని స్థితిలో ఉంది. స్మార్ట్‌ఫోన్ హోరులో లేఖల మనుగడకు ముప్పు వచ్చింది. విద్యార్థులు లేఖలు రాసేలా పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించకపోగా తర్వాత కూడా వీటి అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. 24 గంటలు స్మార్ట్‌ఫోన్‌తో అరకొర సందేశాలు పంపడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్న విద్యార్థులు, యువత లేఖ ప్రాధాన్యతను, అందులోని ఆనందాన్ని తెలుసుకోలేకపోతోంది. సాంకేతికత విరాజిల్లుతోన్న ఈ రోజుల్లో పాత జ్ఞాపకాల సంగతి పక్కన పెడితే ఎలాంటి సమాచారాన్నైనా క్షణాల్లో చేరుతుందనేది కొందరి వాదన. అప్పట్లో ఉత్తరాలు పోస్ట్ చేస్తే నాలుగైదు రోజుల తర్వాత చేరేవి. కానీ ప్రస్తుతం క్షణాల్లోనే సమాచారం వస్తోందని పలువురు చెబుతున్నారు.

అదో తీపి గుర్తు



మనలోని భావాల్ని, ఎదుటివారికి నేరుగా చెప్పలేని విషయాలను ఉత్తరాల ద్వారా చక్కగా వివరించవచ్చు. ఉత్తరం ఓ మధుర జ్ఞాపకం. మన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఇలా ఎవరికి రాసినా అదొక తీపి గుర్తు. లేఖలు భాషపై పట్టు పెంచుతాయి. ఈ విషయాన్ని నేటి తరం యువత గుర్తించి మళ్లీ ఉత్తరాలు రాసే సంస్కృతిని తీసుకురావాలి.
– గాజులపల్లి రామిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు, సీతారామపురం

గొప్ప సంస్కృతి



లేఖలు రాయడం గొప్ప సంస్కృతి. మనం చెప్పాలనుకున్న విషయాలను, ఆలోచనలు, భావాలను ఫోన్ల ద్వారా చెప్పడం కన్నా ఉత్తరాల్లో చక్కగా రాసి పంపవచ్చు. నా స్నేహితులు పంపిన ఉత్తరాలు నేటికీ పదిలంగా దాచుకున్నాను.
– బొగ్గవరపు రత్నం, అయ్యవారిపల్లి

అద్భుతమైన జ్ఞాపకం



ఉత్తరం అద్భుతమైన జ్ఞాపకం. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగే కొద్దీ కలం, కాగితాన్ని పక్కన పెట్టి స్మార్ట్‌ఫోన్లకు పనిచెబుతున్నారు. ప్రతి చిన్న విషయాన్ని వాట్సప్, ఫేస్‌బుక్, సెల్‌ఫోన్ మెసేజ్‌ల ద్వారా చేరవేస్తున్నారు.
– ఖాజామొహిద్దిన్, వీఆర్వో, సీతారామపురం

గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్సై అనూష

సీతారామపురం : గ్రామాల్లో ప్రజలు సోదరభావంతో ప్రశాంతంగా జీవించాలని ఎస్సై అనూష సూచించారు. ఆమె శనివారం సీతారామపురంలోని ఎస్సీకాలనీలో పర్యటించి స్థానిక బిట్-2 సచివాలయం వద్ద కాలనీవాసులకు శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు కక్షలు పెంచుకోకుండా ఒకరికొకరు సఖ్యతగా మెలగాలన్నారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి, ఘర్షణలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చండి



ఆత్మకూరురూరల్: త్వరలో పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆత్మకూరు మండలంలోని మహిమలూరు ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు శనివారం తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందుతున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఇంగ్లిషు మీడియంతోపాటు విద్యాసామగ్రి, ప్రతి రోజూ ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు.

దోమల నివారణతో మలేరియాను పారదోలుదాం

కొడవలూరు: దోమలను నివారించడం ద్వారా మలేరియాను పారదోలుదామని యల్లాయపాళెం వైద్యాధికారిని సింధు మేఘన పిలుపునిచ్చారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది మలేరియాపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల కారణంగానే మలేరియా వ్యాధి సోకుతుందన్నారు. రెండ్రోజుల కంటే ఎక్కువ చలి, జ్వరం వస్తుంటే మలేరియాగా అనుమానించి వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మలేరియాపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రాణాంతకంగా మారుతుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రాత్రి వేళ దోమతెరలు వాడడం ద్వారా దోమల బారిన పడకుండా చూసుకోవాలని చెప్పారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూఓ నాగరాజు, పీహెచ్ఎన్ విజయ, ఏఎన్ఎం సుకన్య, స్టాఫ్‌నర్స్ స్వర్ణలత, హెచ్ఏలు ప్రసాద్, ఎం సురేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మకు పూజలు



పెన్నానదికి ఊరేగింపుగా తరలివెళ్తున్న కనకదుర్గమ్మ అమ్మవారు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో వెలసిన శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం కనకదుర్గమ్మ ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమను అభిషేకోత్సవం కోసం పెన్నానదికి ఊరేగింపుగా తరలించారు. రాత్రికి పండరి భజన, అగ్నిగుండం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంగంలో భారీ వర్షం



సంగంలో కురుస్తున్న వర్షం

సంగం: మండల కేంద్రం సంగంతోపాటు అనేక గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై వర్షం ప్రభావంతో వాహనచోదకులు తమ వాహనాలను పక్కన నిలిపివేశారు. పలుచోట్ల చిన్నపాటి చెట్లు నేలకూలాయి. వర్షంతో రోడ్లన్నీ జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న సీఐ గిరిబాబు

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు స్నేహపూర్వకంగా మెలగాలని, వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ వి.గిరిబాబు సూచించారు. ఉదయగిరిలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురిని పిలిపించి తగాదాలతో వచ్చే పరిణామాలను వివరించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల కార్డన్ సెర్చ్ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లాలని తెలిపారు. ఆయన వెంట ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగులు



దుత్తలూరు సెంటర్‌లో ముసుగు తొలగించని వైఎస్సార్ విగ్రహం

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల కోడ్ ఎత్తివేశారు. ఎలక్షన్ ప్రక్రియలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు వేసిన ముసుగులు మాత్రం ఇంకా తొలగించలేదు. వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, కలిగిరి మండల కేంద్రాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముసుగులు వేశారు. ఈ నెల 6వ తేదీన దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ముగిసినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అయినా ఇంకా విగ్రహాలకు ముసుగులు తొలగించకపోవడం గమనార్హం.

కొల్లపునాయుడుపల్లిలో ఫ్యామిలీ డాక్టర్



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని కొల్లపునాయుడుపల్లి గ్రామంలో ఉన్న సబ్ సెంటర్‌లో చిత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంగూరులో 104 వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శాంతి

మర్రిపాడు: మండలంలోని పొంగూరు గ్రామంలో శనివారం 104 విద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి డాక్టర్ శాంతి పలువురికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్తులు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. తద్వారా వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని, ప్రజలు వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం



ఏఎస్‌పేట ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు



వింజమూరులోని బంగ్లా సెంటర్‌లో నిలిచిన వర్షపునీరు

అనుమసముద్రంపేట: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే ఏఎస్‌పేట ప్రధాన రహదారి జలమయమైంది. ఏఎస్‌పేట బస్టాండ్ వద్ద వర్షపునీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. రోడ్డుకిరువైపులా స్థలాలు ఆక్రమించి రూంలు నిర్మించడం వల్ల సైడుకాలువల నిర్మాణానికి వీలు లేకుండాపోయింది. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు నిలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన నీరు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే

వింజమూరు(ఉదయగిరి): నైరుతి రుతుపవనాల నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గత మూడ్రోజులుగా ఆడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు రైతులకు మేలు చేకూరుస్తుండగా.. పల్లెల్లో మాత్రం అంతర్గత రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. అక్కడక్కడా గుంతలు ఉండడంతో నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వింజమూరు, ఉదయగిరి పట్టణాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపునీరు బయటకు వెళ్లడం లేదు. మురుగునీరు రోడ్లపైనే నిల్వ ఉంటోంది. వింజమూరు పట్టణంలోని బంగ్లా సెంటర్ వద్ద దుకాణదారులు రోడ్డును ఆక్రమించి డ్రైనేజీని మూసివేయడంతో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. బీసీకాలనీలో కూడా రోడ్డుపై మోకాలు లోతు నీరు నిలిచి ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



వింజమూరు బీసీకాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ చెరుకూరు దొరస్వామినాయుడు సహకారంతో మాజీ మేయర్ భానుశ్రీ చేతుల మీదుగా పౌష్టికాహారాన్ని అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి రమేష్ బాబు పాల్గొన్నారు.